క్లుప్తంగా

సస్యరక్షణ పనుల్లో నిమగ్నమైన రైతులు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు బుధవారం ఆగడంతో రైతులు సస్యరక్షణ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయశాఖ అధికారులు సైతం గ్రామాల్లో పంటలను పరిశీలించి నష్టాలను అంచనా వేస్తున్నారు. పంట నష్టం నివారణ చర్యలు చేపట్టడానికి రైతులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఒంగోలు ఏడీఏ రమేష్‌బాబు తన సిబ్బందితో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఒంగోలు డివిజన్ పరిధిలో వివిధ పంటలకు 19,657 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక ప్రకాశం భవనం వద్ద గల అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ మినీ సెంటర్ల టీచర్లకు ప్రమోషన్లు అమలు చేయాలని, పనిదినాలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో తంగిరాల మహేష్, ఎస్‌డీ హుసేన్, కేవీ సుబ్బమ్మ, హెమీమా, అరుణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

నారాయణరావుకు ఘనంగా వీడ్కోలు



డాక్టర్ నారాయణరావుకు వీడ్కోలు పలుకుతున్న రిమ్స్ బృందం

ఒంగోలు టౌన్: ఒంగోలు సర్వజన ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీగా విధులు నిర్వహిస్తూ గుంటూరు బదిలీ అయిన డాక్టర్ నారాయణరావుకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ ఒంగోలు ప్రభుత్వ వైద్యకళాశాల అభివృద్ధిలో, జీజీహెచ్‌లో నిరంతర వైద్య సేవల్లో నారాయణరావు కీలకపాత్ర పోషించారని కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్‌గా ఒంగోలు మెడికల్ కళాశాలకు పీజీ సీట్లు రావడానికి ఆయన చేసిన కృషి ఎన్నటికీ మరచిపోలేమన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.భగవాన్ నాయక్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ తిరుమలరావు, పలు విభాగాల హెచ్‌ఓడీలు, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రసాద్ మరణం దళిత జాతికి తీరనిలోటు

ఒంగోలు: దళిత ఉద్యోగ సంఘాల నేత డీపీఆర్ ప్రసాద్ మరణం దళిత జాతికి తీరని లోటని ఏపీ దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు విజేంద్ర బహుజన్ అన్నారు. స్థానిక సీఆర్పీ క్వార్టర్స్‌లో డీపీఆర్ ప్రసాద్ భౌతికకాయాన్ని బుధవారం ఆయన సందర్శించి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో దళితసేన జిల్లా అధ్యక్షుడు పీకా మధుసూదన్‌రావు, గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, సామాజిక ఉద్యమనేత దారా జంక్షన్‌రావు, పక్కెల వజ్రంబాబు, భారత్ పార్టీ జిల్లా నాయకుడు గుంతోటి విజయరాజు, జైభీమ్ భారత్ పార్టీ జిల్లా నాయకుడు కాటుకూరి డేవిడ్, తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ చేయాలి



సామాజిక తనిఖీపై అవగాహన కల్పిస్తున్న ఝాన్సీరాణి

కొత్తపట్నం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీని పారదర్శకంగా చేయాలని డ్వామా ఆఫీస్ నుంచి వచ్చిన డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్ ఝాన్సీరాణి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి సామాజిక తనిఖీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా 2022-23 సంవత్సరంలో చేసిన రూ.5 కోట్ల పనులపై తనిఖీ చేస్తారని చెప్పారు. సామాజిక తనిఖీ అనంతరం ఆయా పంచాయతీల్లో గ్రామ సభ ఏర్పాటు చేసి అక్కడ అన్ని చదివి వినిపించడం జరుగుతుందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో చివరి సమావేశం జరుగుతుందన్నారు. ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, జేఈ చంద్రశేఖర్, ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

దర్శి: దర్శిలో విద్యుత్ అంతరాయం పేరుతో బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడారు. సోమవారం నుంచి మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంగళవారం సాయంత్రం వరకు కూడా విద్యుత్ సరఫరా కాలేదు. బుధవారం ఉదయం చకచకా పనులు పూర్తి చేసి అన్నీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అందించారు.

దేశానికి దిక్సూచి..అంబేడ్కర్

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు
- అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు



మద్దిపాడులో నివాళులర్పిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండవ అప్పారావు, నాయకులు



వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో...

మద్దిపాడు: భారత రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిక్సూచిగా అంబేడ్కర్ నిలిచారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని మద్దిపాడు మండలంలోని మల్లవరం సమీపంలో ఉన్న వైఎస్సార్ విజయభవన్‌లో బుధవారం అంబేడ్కర్‌కు ఎమ్మెల్యే టీజేఆర్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు పలు హక్కులు కల్పించి వారి అభ్యున్నతికి తోడ్పాటు అందించేందుకు అంబేడ్కర్ కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో బత్తుల శ్రీనివాసరావు, యర్ర దశరథ, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల నివాళులు...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు బుధవారం మద్దిపాడులో ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు మండల పరిషత్ సమావేశ మందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా కళా కేంద్రం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మజీద్, గుడ్డపాతల రవి, మోరబోయిన సంజీవరావు, తేళ్ల పుల్లారావు, మందా చిన్న, ఎంపీటీసీ బొమ్మల దాసు, సర్పంచ్‌లు నారా సుబ్బారెడ్డి, బొమ్మల రామాంజనేయులు, నాగమల్లీశ్వరి, శ్రీకాంత్ శ్రీవర్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద, రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, తప్పెట బాబూరావు, కేఎస్‌పీఎస్ నాయకుడు దుడ్డు వెంకట్రావు, వైఎస్సార్ భారతి సేవా సమితి అధ్యక్షురాలు పాటిబండ్ల రాజసులోచన, మాజీ జెడ్పీటీసీ గోగినేని వెంకటేశ్వర్లు, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి సమక్షంలో ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేర్నమిట్ట 42వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు, 39వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ గోలి లక్ష్మి, వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, నాయకులు నివాళులర్పించారు. అంబేడ్కర్ గ్రంథాలయ ప్రతినిధి నూకతోటి రవికుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీవో నివాళులు...

ఒంగోలు సిటీ: స్థానిక జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీఓ జి.వి.నారాయణరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అంబేడ్కర్ గొప్పతనాన్ని కొనియాడారు. ఏఓ శివప్రసాద్, డీపీఆర్సీ డీసీ రమేష్, స్వామిత్వ నోడల్ ఆఫీసర్ జగదీష్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంప్లాయీస్‌, ఏపీజీఈఎఫ్ ఆధ్వర్యంలో...

ఒంగోలు అర్బన్: ఎంప్లాయీస్‌, ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండ్లూరి చిట్టిబాబు ఆ యూనియన్ కార్యవర్గ సభ్యులతో కలిసి స్థానిక హెచ్‌సీఎం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు కొలకలూరి ప్రభాకర్, షాలేం రాజు, మస్తాన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో...

ఒంగోలు టౌన్: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఆధ్వర్యంలో స్థానిక హెచ్‌సీఎం కళాశాల వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరసుల వెంకటేశ్వర్లు, నాయకులు కె.వెంకటేశ్వర్లు, వి.బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, ఉపగ్రంథపాలకులు బొమ్మల కోటేశ్వరి, సిబ్బంది కె.సంపూర్ణ, ఎం.శ్రీనివాసులు, పి.ఇమానియేలు, టి.కృష్ణవేణి, వై.మృదుల్, స్మైలీ, కె.అశోక చక్రవర్తి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నివాళులు...

ఒంగోలు సెంట్రల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జి యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక హెచ్‌సీఎం స్కూల్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు పేముల మోజీ, నన్నేపోగు సుబ్బారావు, శివాజీ యాదవ్, మధు యాదవ్, కోటేశ్వరి, శ్రీనివాసరావు, దామోదర్, రాధాకృష్ణ, శిరీష, మిరియం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో పలు సంఘాల ఆధ్వర్యంలో...

ఒంగోలు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో తోరటి ఆనంద్ మాదిగ, ఎంఎస్‌పీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి తిరువీధుల బాబుమాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆదిమూలపు ప్రకాష్ మాదిగ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు జనరాజుపల్లి ఆంజనేయులు మాదిగ, చంద్ర మాదిగ, రాజు మాదిగ, ఎండ్లూరి చిట్టిబాబు మాదిగ తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్, యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతందేవ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలామణి, సీడీసీ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ జి.సోమశేఖర్, ఏసీఈ డాక్టర్ పి.వెంకట్రావు తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక హెచ్‌సీఎం కాలేజీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ బ్యాంక్ రిటైర్డ్ చీఫ్ మేనేజర్ మస్తానయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు. జైభీమ్ ఫౌండేషన్ యూత్ ఆర్గనైజర్ చిక్కాల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శివం ఫౌండేషన్ సంచార వాహనం ద్వారా యాచకులు, పేదలు, అనాథలకు అన్నదానం చేశారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు మిడసల మధు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా, అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు. ఏపీ దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు విజేంద్ర బహుజన్ స్థానిక హెచ్‌సీఎం కాలేజీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితసేన జిల్లా అధ్యక్షుడు పీకా మధుసూదన్‌రావు, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గుంతోటి విజయ్‌రాజ్, సామాజిక న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు పక్కెల వజ్రంబాబు, జైభీమ్ భారత్ పార్టీ నాయకుడు కాటుకూరి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో...

ఒంగోలు సబర్బన్: స్థానిక జిల్లా వాణిజ్య పన్నుల శాఖ సర్కిల్-1 కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ దుంపా ఝాన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ శాఖ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పైనం మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. అంబేడ్కర్ దేశానికి చేసిన సేవల గురించి వారు కొనియాడారు. నెల్లూరు డివిజన్ జాయింట్ కమిషనర్ ఏ రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవగా, దివ్యాంగుల దినోత్సవాన్ని కూడా పురస్కరించుకుని దివ్యాంగులను సన్మానించారు. కార్యక్రమంలో ఒంగోలులోని రెండు సర్కిల్ కార్యాలయాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మల్లవరంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



ఒంగోలు డీపీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న డీపీఓ నారాయణరెడ్డి



ఒంగోలులో నివాళులర్పిస్తున్న మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు



ఏపీ దళిత మహాసభ నాయకుల నివాళులు...



ఏపీజీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, సభ్యుల నివాళులు...



జైభీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



ఏకేయూ కాలేజీలో...



జిల్లా గ్రంథాలయంలో...



చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, ప్రజాసంఘాల నాయకులు



సంతనూతలపాడులో నివాళులర్పిస్తున్న దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ, నాయకులు



పేర్నమిట్టలోని 42వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్, ప్రజాసంఘాల నాయకులు



39వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ నాయకులు

ఏపీకి జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న మండవ అప్పారావు, నాగమల్లీశ్వరి, నాయకులు

మద్దిపాడు: ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని రాచవారిపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ప్రతి వర్గానికి జగనన్న మేలు చేశారని తెలిపారు. నా వలన మేలు జరిగితేనే ఓటు వేయండని అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేయడానికి కంకణం కట్టుకున్న ముఖ్యమంత్రి జగనన్నను ప్రజలు మళ్లీ ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఏఓ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు పిట్టల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సర్పంచ్ పురాలశెట్టి నాగమల్లీశ్వరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కుల గణనపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత, పక్కన కమిషనర్, డిప్యూటీ మేయర్, అధికారులు

- మేయర్ గంగాడ సుజాత



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో బుధవారం కార్పొరేటర్లు, కుల సంఘాల నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులగణన సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అందుకోసం కార్పొరేటర్లు, కుల సంఘాల నాయకులు ఒంగోలు నగరంలో జరిగే కుల గణన విషయంలో విధివిధాలను అవగాహన చేసుకుని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

- ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ సుభాషిణి



ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను చూపిస్తున్న రైతులు

ఒంగోలు సెంట్రల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకునే శక్తి ఉంటుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి అన్నారు. నాగులుప్పలపాడు మండలం పోతవరంలో అంజిరెడ్డి అనే రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న మిరప, కంది, మినుము, కూరగాయల పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. తుఫాన్ వలన ఆయా పంటలు పెద్దగా దెబ్బతినలేదని చెప్పారు. సస్యరక్షణకు ఘన జీవామృతం, వేప పిండిని మొక్కల మొదళ్లలో వేయాలని, పుల్లటి మజ్జిగ పిచికారీ చేయాలని సూచించారు.

పథకాలతో కుటుంబాల అభివృద్ధి



పథకాల గురించి వివరిస్తున్న అధికారులు

సంకువారిగుంట (కొత్తపట్నం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా సంకువారిగుంటలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ కసుకుర్తి సుబ్బరత్నమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 17 రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అందరికీ అందుతున్నాయా, ఎవరికైనా అందకుంటే తెలుసుకుని అందించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈతముక్కల పీహెచ్‌సీ డాక్టర్ శివపార్వతి పథకాల గురించి వివరించారు. అగ్రికల్చర్ ఏడీ ప్రభాకర్ డ్రోన్ ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. ఏపీఎం రజియా సుల్తాన్‌బేగం, పంచాయతీ కార్యదర్శులు ఆర్.శ్రీనివాస్, ఎం.ఉమామహేశ్వరి, జయశంకర్, హెచ్ఎం నాగేశ్వరరావు, సునంద, ఏఆర్‌సీ శ్రీనివాసులు, కసుకుర్తి వెంకట్రావు, బీజేపీ మండల అధ్యక్షుడు నాదారు సుబ్రహ్మణ్యం, దుగ్గిరాల విజయకుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కాలువల్లో అడ్డంకులు తొలగించాలి

- పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్ వెంకటేశ్వరరావు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలోని మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. మిచాంగ్ తుఫాన్ తర్వాత పరిస్థితులపై అధికారులతో కమిషనర్ సమీక్షించారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో తుఫాన్ కారణంగా వర్షం నీరు నిలవడంతో జేసీబీలు, పొక్లెయిన్లతో పూడిక తీయించి తొలగించారు. సజావుగా వర్షం నీరు పోయేవిధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.